క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.51 వేల విరాళం



దాత పూర్ణారావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ దుర్గారావు

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఉంగుటూరు మండలం సీతారాంపురానికి చెందిన భక్తుడు గేదెల పూర్ణారావు రూ.51 వేలను విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ద్వారకాతిరుమలకు పాదయాత్ర

జంగారెడ్డిగూడెం : భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం నుంచి ద్వారకాతిరుమలకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యులు తెలిపారు. సోమవారం జంగారెడ్డిగూడెంలో పాదయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుధవారం ఉదయం 5 గంటలకు జంగారెడ్డిగూడెంలోని గంగానమ్మ గుడి వద్ద నుంచి యాత్ర ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు హిందూ ధర్మ ప్రచా పరిషత్‌సభ్యులను సంప్రదించాలన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

జంగారెడ్డిగూడెం : అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు బాలల హక్కులు, విద్యకు దూరమైన చిన్నారుల గుర్తింపుపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గెడా జగ్గారావు అధ్యక్షత వహించారు. న్యాయవాదులు అచ్యుత శ్రీనివాసరావు, బల్లే సాయికుమారి, ఉస్సే శివశంకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న తపన చౌదరి

బుట్టాయగూడెం : మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారిత సాధ్యమని తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి తపన చౌదరి అన్నారు. స్థానిక విద్యారోహిణీ హైస్కూల్‌లో సుమారు 7 నెలలపాటు తపన ఫౌండేషన్ సహకారంతో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు సోమవారం కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ కొండేపాటి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సత్యసాయి సంస్థల ప్రతినిధి గడా జీబాబు, సమరసతా ఫౌండేషన్ ప్రతినిధి సోర్న పుణ్యలక్ష్మి, ఆర్ఎంపీ వైద్యుల సంఘం నాయకులు కొండపల్లి వీర్రాజు, బీజేపీ నాయకులు ఈరంకి రవి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడులు

కొయ్యలగూడెం : రామానుజపురం గ్రామ సమీపంలో కోడి పందేల శిబిరాలపై కొయ్యలగూడెం పోలీసులు సోమవారం దాడులు చేశారు. 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 20,040 నగదు, రెండు కార్లు, ఏడు మోటార్ సైకిళ్లు, రెండు కోళ్ళు, కత్తులు స్వాధీనం చేసుకున్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

పోలవరం రూరల్ : మోటార్ సైకిల్‌పై ప్రయాణించే వాహనదారులు తగు జాగ్రత్తలు పాటిస్తూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎస్.పవన్‌కుమార్ సూచించారు. పోలవరంలోని ఏటిగట్టు సెంటర్‌లో వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే భద్రతపై అవగాహన కల్పించారు. అలాగే రోడ్డుపై అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చేయకూడదన్నారు.

4 వరకు చేదోడు పథకం పొడిగింపు

కొయ్యలగూడెం: జగనన్న చేదోడు పథకం పొడిగింపునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీపీ గంజిమాల రామారావు సోమవారం పేర్కొన్నారు. జగనన్న చేదోడు పథకానికి అర్హులైన అనేకమంది సాంకేతిక కారణాలవల్ల దరఖాస్తులు సకాలంలో అందజేయలేకపోయారని, ఈ నేపథ్యంలో అర్జీదారుల నుంచి విన్నపాలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. ఇప్పటి వరకు జగనన్న చేదోడు పథకం మూడో విడత సాయం జనవరి 27వ తేదీ వరకు పరిశీలించిన దరఖాస్తులకే సొమ్ములు జమ చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 4వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, అర్హులైన వారికి నేరుగా సొమ్ములు వారి బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు.

జాతిపితకు ఘన నివాళి



బుట్టాయగూడెంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ శాంతి



కొయ్యలగూడెంలో జాతిపితకు నివాళులు అర్పిస్తున్న అధికారులు



పోలవరంలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చిన ఎంతో మంది మహనీయుల్లో మహాత్మాగాంధీ పేరు ఎప్పుడూ మొదటిగా ఉంటుందని తహసీల్దార్ ఎస్. శారా శాంతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ సత్యాన్ని చేతపట్టి ధర్మమార్గంలో నడిచి బ్రిటిష్ వారిని తరిమికొట్టిన గొప్పనేత మహాత్మాగాంధీ అని అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వైవీ లక్ష్మీకుమారి, ఆర్ఐ లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, వీఆర్ఓలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయాలను సాధించాలి

జీలుగుమిల్లి ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఎంపీడీఓ మంగతయారు మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులను సదా స్మరించుకోవాలి

కొయ్యలగూడెం: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. తహసీల్దార్ పాశం నాగమణి, ఎంపీడీవో కేఆర్ఎస్ కృష్ణ ప్రసాద్ జాతిపిత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీ చూపిన సన్మార్గం, శాంతి, అహింస, ప్రపంచ మానవాళికి దిక్సూచిగా నిలిచిందన్నారు. మహాత్ముని వర్ధంతిని జాతీయ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యాశాఖకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గాంధీజీ సేవలను ఆదర్శంగా తీసుకోవాలి

కామవరపుకోట : వాసవీ క్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతి నిర్వహించారు. స్థానిక చౌతన సెంటర్లో గాంధీ విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. క్లబ్ ప్రెసిడెంట్ జయవరపు లక్ష్మణ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గాంధీజీకి పలువురి నివాళి

పోలవరం రూరల్ : గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని గాంధీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసిల్దార్ బి.సుమతి నివాళులు అర్పించారు.

యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

లింగపాలెం: గాంధీజీ ఆలోచనలు, ఆదర్శాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ధర్మాజీగూడెం వాసవీ క్లబ్ అధ్యక్షుడు సోమిశెట్టి గంగాధరరావు అన్నారు. మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం ధర్మాజీగూడెంలో వాసవీక్లబ్, వాసవీ వనితా డైమండ్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

గాంధీజీ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

చింతలపూడి : మహాత్మా గాంధీ ఇచ్చిన స్ఫూర్తితో భావి తరాలు ముందుకు సాగాలని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ హెచ్ఎం ఎం.చక్రధరరావు పిలుపునిచ్చారు. మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు కె.సుజాత గాంధీపై కవితను వినిపించారు.

గాంధీజీకి నివాళులు

ద్వారకాతిరుమల: కుష్టు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని ద్వారకాతిరుమల సర్పంచ్ కుంటం స్వర్ణలత అన్నారు. జాతిపిత మహాత్మా గాంధి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక సచివాలయ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి స్వర్ణలత పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సోమవారం నుంచి వచ్చేనెల 13 వరకు కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, చిలుకూరి చంద్రం, తేలు వెంకటేశ్వరరావు, దూలపల్లి ప్రసాద్, చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

'పోలవరం' సర్పంచ్‌ల ప్రతినిధిగా సోమరాజు



వేదాంతపురం సర్పంచ్ సోమరాజు

కొయ్యలగూడెం : ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు తాను పోలవరం నియోజకవర్గ సర్పంచ్‌ల ప్రతినిధిగా నియమింపబడినట్లు వేదాంతపురం గ్రామ సర్పంచ్ గేలం త్రివిక్రమ సోమరాజు తెలిపారు. ఫిబ్రవరి ఒకటో తేదీన రాష్ట్రస్థాయి పంచాయతీ సర్పంచుల సమావేశానికి తాను హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో తాను పాల్గొనడం మంచి అవకాశంగా భావిస్తున్నానని, సమావేశంలో గ్రామ సర్పంచ్‌ల సమస్యలను వివరిస్తానని చెప్పారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ కేఎం మంగతయారు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ఆమె వెల్లడించారు. కామయ్యపాలెం -1, జీలుగుమిల్లి-1, తాటాకులగూడెం-1, దర్భగూడెం-3, అంకన్నగూడెం-1 చొప్పున మొత్తం 7 ఖాళీలు ఉన్నాయన్నారు. ఈ పోస్టులన్నీ షెడ్యూల్ తెగలతోనే భర్తీ చేయబడతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఫిబ్రవరి 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగన్‌ను గెలిపించాలి

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జంగారెడ్డిగూడెం 3వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మూడేన్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని, ఇటువంటి పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీలోని 2వ సచివాలయం పరిధిలోని 3వ వార్డులో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ లబ్ధిదారులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పేద బడుగు బలహీన వర్గాలకు మేలు చేసేందుకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి గడపకు ఏదో ఒక ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి అందుతుందని, ఈ విషయాన్ని ప్రజలే స్వయంగా తమకు తెలియజేస్తుండడంగా ఆనందంగా ఉందన్నారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పాడి పశువుల కోసం మొబైల్ అంబులెన్స్‌లు

పశువుల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ అంబులెన్స్ ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే ఎలీజా చెప్పారు. ఈ అంబులెన్స్‌ల ద్వారా క్షేత్రస్థాయిలో పశువులకు వైద్యం అందించడం జరుగుతుందన్నారు. చింతలపూడి నియోజకవర్గ పరిధిలో రెండు మొబైల్ అంబులెన్స్‌లను కేటాయించారని, అవి చింతలపూడి, జంగారెడ్డిగూడెంలలో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అంబులెన్స్‌లో పశువైద్యాధికారితో పాటు అవసరమైన సిబ్బంది, మందులు అందుబాటులో ఉంటాయని రైతులు సద్వినియోగం చేసుకుని పశుగణాన్ని కాపాడుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, ఐసీడీఎస్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాలపద్మ, వైస్ చైర్మన్లు ముప్పిడి అంజి, కంచర్ల వాసవీ రత్నం, పట్టణ, మండల కన్వీనర్‌లు పీపీఎన్ చంద్రరావు, వామిశెట్టి హరిబాబు, కమిషనర్ పి.భవానీప్రసాద్, నాయకులు బత్తిన చిన్న, గూడపాటి రాధాకృష్ణ, కేమిశెట్టి మల్లిబాబు, సీహెచ్ అచ్చిరాజు, ఎల్. వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన



ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు

కామవరపుకోట : కొత్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామస్తులకు కుష్టు వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామని గ్రామస్తులతో కలిసి వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. గ్రామస్తులు మెరుగు బాబురావు, కొత్తూరు సచివాలయ కార్యదర్శి బి.మనోజ్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎం ప్రియదర్శిని, రేవతి, ఆశ కార్యకర్తలు లిల్లీబాయి, తేరిజా, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అపోహలు తొలగాలి

కొయ్యలగూడెం : కుష్టు అంటువ్యాధి కాదని, వ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించాలని, ప్రభుత్వం అందించే మందులను విధిగా వాడితే వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని సర్పంచ్ ముప్పిడి విజయ్ కుమారి పేర్కొన్నారు. సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద కుష్టు వ్యాధి నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు.

ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: దేవులపల్లికి చెందిన దోరేపల్లి చిన్మయ్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రావెళ్ల శ్రీనివాసరావు, బొప్పన వైశాలిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం దోరేపల్లి చిన్మయ్‌బాబు జంగారెడ్డిగూడెంలో భూమి కొనుగోలు చేయాలనే ఉద్దేశంతో మధ్యవర్తులను సంప్రదించగా, వారు రావెళ్ల శ్రీనివాసరావు, బొప్పన వైశాలిలకు జంగారెడ్డిగూడెంలో వ్యవసాయ భూమి ఉందని, మంచి ధర వస్తే అమ్మడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారన్నారు. ఈ క్రమంలో సదరు భూమిని పరిశీలించి శ్రీనివాసరావు, వైశాలిలతో 71 సెంట్ల భూమిని రూ.95 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని, అందుకుగాను రూ.30 లక్షలు అడ్వాన్స్‌గా చిన్మయ్ బాబు ఇచ్చాడన్నారు. మిగిలిన సొమ్ము చెల్లించి 2020 జూన్ 15న రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు నిర్ణయించగా, సదరు భూమి రెవెన్యూ రికార్డుల్లో, ఆన్‌లైన్‌లో శ్రీనివాసరావు, వైశాలి పేరున లేకపోవడంతో ఆన్‌లైన్ చేయించుకున్న అనంతరం మీకు రిజిస్ట్రేషన్ చేస్తామని చిన్మయ్‌బాబుకు తెలిపి, అందుకు గడువు కోరుతూ అగ్రిమెంట్‌పై సంతకాలు చేశారన్నారు. అయితే ఆన్‌లైన్ నమోదైన విషయం తెలుసుకుని సదరు భూమి తనకు రిజిస్ట్రేషన్ చేయమని చిన్మయ్‌బాబు కోరగా, వారు స్పందించకపోగా, సదరు భూమిని మరొకరికి అమ్మివేశారన్నారు. దీనిపై పెద్దమనుషుల సమక్షంలో అడగగా, భూమికి గాని, తీసుకున్న రూ.30 లక్షలు అడ్వాన్స్ సొమ్ముకు ఎటువంటి సమాధానం ఇవ్వకపోవడంతో ఉద్దేశపూర్వకంగానే తనను మోసం చేశారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని చిన్మయ్‌బాబు ఫిర్యాదు చేశాడన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సచివాలయాల కన్వీనర్లు అంకితభావంతో పనిచేయాలి



కొయ్యలగూడెంలో గ్రామ సచివాలయాల కన్వీనర్ల సమావేశంలో ప్రసంగిస్తున్న నూకల రాము

కొయ్యలగూడెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాల కన్వీనర్ల వ్యవస్థ విజయవంతానికి అంకితభావంతో కృషి చేయాలని జగనన్న సచివాలయాల మండల కోఆర్డినేటర్ (సచివాలయాల మండల కన్వీనర్) నూకల రాము పిలుపునిచ్చారు. సచివాలయాల కన్వీనర్లుగా నియమితులైన 66 మందితో సోమవారం సమావేశం నిర్వహించారు. వలంటీర్ల వ్యవస్థ దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకుందని, అదే కోణంలో సచివాలయాల కన్వీనర్ల వ్యవస్థ కూడా పేరు సాధించాలన్నారు. సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు జగనన్న ప్రభుత్వాన్ని తిరిగి ఏర్పాటు చేయడంలో రెండు కళ్లుగా వ్యవహరించి జగనన్న రుణం తీర్చుకోవాలి అన్నారు. జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ సంకుకొండ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, నియోజకవర్గ, మండల సర్పంచ్ల ఛాంబర్ల ప్రతినిధులు గేలం త్రివిక్రమ సోమరాజు, ఏలేటి చిన్న తుక్కయ్య, మాజీ ఎంపీపీ మట్ట సత్తిపండు, ఎస్కే బాజీ, నిక్కర్ నాగేశ్వరరావు, మారిశెట్టి శ్రీను, ఘంటసాల మధు, కండెల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

కోడి పుంజుల చోరీపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: గుర్తు తెలియని వ్యక్తులు కోడి పుంజులను చోరీ చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. మండలంలోని ఐఎస్.రాఘవాపురం పంచాయతీ రామానుజాపురంలో మట్టపర్తి సత్యన్నారాయణ ఇంటి వద్ద గాబుల్లో ఉంచిన రెండు కోడి పుంజులను గుర్తు తెలియని వ్యక్తులు ఈనెల 13న చోరీ చేశారు. దీనిపై బాధితుడు సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చెరకు తోట దగ్ధం

బుట్టాయగూడెం: మెట్టగూడెంలో సోమవారం సంభవించిన అగ్నిప్రమాదంలో మద్దిపాటి రాంబాబుకు చెందిన 18 ఎకరాల చెరకు తోట దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు రైతు తెలిపారు. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారులు మంటలను అదుపు చేశారు. ఆర్ఐ లక్ష్మి, వీఆర్ఓ నాగేశ్వరరావు ఘటన వివరాలను సేకరించారు.

చేనేత సంఘం సమావేశం

జంగారెడ్డిగూడెం : చేనేత వర్గాల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం కానూరి ఆదినారాయణ భవన్‌లో సోమవారం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వాసా రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బీఎల్ఐసీ ప్రసాద్, కార్యదర్శిగా మసరం ధనరాజు, సహాయ కార్యదర్శిగా సింగుదాసు వెంకట సత్యనారాయణ, ట్రెజరీగా కానూరి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పౌష్టికాహార పంపిణీలో నిర్లక్ష్యం వద్దు



కోయిదా పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డాక్టర్ మానస

వేలేరుపాడు : ఏజెన్సీ ప్రాంతంలోని పాఠశాలలు, అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో సిబ్బంది అలక్ష్యం ప్రదర్శిస్తే సహించేది లేదని ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్, ఆర్బీఎస్కే కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ మానస హెచ్చరించారు. సోమవారం మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఆమె పర్యటించారు. అత్యంత మారుమూలనున్న తాళ్ళగొంది అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఇక్కడ పిల్లలకు కోడిగుడ్లు పంపిణీ చేసినట్లు రిజిస్టర్‌లో ఉండగా, ఆ గుడ్లన్నీ అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ ఉండడంపై సదరు అంగన్‌వాడీ కార్యకర్తను ప్రశ్నించారు. వెంటనే పిల్లలకు కోడి గుడ్లను అందించాలని ఆదేశించారు. కొయిదా, కొత్తూరు, బోళ్ళపల్లి, అంగన్‌వాడీ, పాఠశాలల్లో పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో గిరిజనులకు దుస్తులు పంపిణీ చేశారు. కొయిదా, వేలేరుపాడు పీహెచ్‌సీలను ఆమె పరిశీలించారు. ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో కేంద్ర బృందం పర్యటించనున్నట్లు మానస పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలేరుపాడు తహసీల్దార్ కె చల్లన్నదొర, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, వైద్యాధికారి రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు పీహెచ్‌సీ పరిశీలన

కుక్కునూరు : రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య జిల్లా కోఆర్డినేటర్ డా.సీహెచ్ మానస సోమవారం కుక్కునూరు పీహెచ్‌సీని సందర్శించారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల విషయమై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాపులేషన్ మినీస్ట్రీస్ ఆఫ్ హెల్త్ నిర్వహించే సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

స్పందనలో 17 అర్జీలు

జంగారెడ్డిగూడెం : స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ సమస్యలపై 17 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో ఎం.ఝాన్సీరాణి తెలిపారు. ఇందులో ఎక్కువగా భూ సంబంధిత సమస్యలు ఉన్నాయన్నారు. వీటిని పరిశీలించి సంబంధిత అధికారులకు బదిలీ చేస్తామని చెప్పారు. నిర్దేశించిన సమయంలో లోగా వాటిని అధికారులు పరిష్కరిస్తారన్నారు.

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని స్పందనలో ఫిర్యాదు

చింతలపూడి : రాఘవాపురం గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి లేఅవుట్ వేసిన ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలని స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ జ్యోతికి వైఎస్సార్ సీపీ నాయకులు గిరి భోగారావు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 213/1లో 1 ఎకరం 40 సెంట్ల ప్రభుత్వ గయ్యాళు భూమి ఉందని, ఇక్కడి మామిడి చెట్లను తొలగించి ప్లాటుగా చేశారని చెప్పారు. సదరు భూమికి దక్షిణం పక్కన ఉన్న 617/1లోని 76 సెంట్ల భూమి రాఘవాపురం సొసైటీకి అప్పగించాలని అధికారులకు దరఖాస్తు చేసినట్లు తెలిపారు. ఇటీవల చింత నిప్పుల సత్యన్నారాయణ అనే వ్యక్తి సుమారు 40 సెంట్లు ఆక్రమించి లేఅవుట్ వేసి ఇళ్ల ప్లాట్లుగా విక్రయించడానికి సిద్ధమైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీజేపీని గద్దె దించాలి

జంగారెడ్డిగూడెం : కార్పొరేట్ సంస్థల కోసం ప్రజలను మతాల పేరున విభజిస్తూ ఫాసిస్ట్ పాలన తీసుకువస్తున్నారని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి సుధాకర్ విమర్శించారు. సీపీఐఎంఎల్ సీనియర్ నాయకులు సత్యనారాయణ సింగ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జంగారెడ్డిగూడెంలో బహిరంగ సభ నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకులు ధర్ముల సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో టి.సుధాకర్ మాట్లాడుతూ మతోన్మాదాన్ని, ఒకే జాతి ఒకే మతం ఒకే బట్ట అనే విధంగా ప్రజలను రెచ్చగొడుతూ ఫాసిస్టు రాజ్యాన్ని ముందుకు తీసుకువస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుతాన్ని గద్దె దింపాలన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

టి.నరసాపురం: బొర్రంపాలెంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నీ సోమవారం ముగిసింది. ఈ టోర్నీలో ఆంధ్ర, తెలంగాణకు చెందిన 30 జట్లు తలపడ్డాయి. విజేతలకు రాష్ట్ర నవరత్నాల వైస్‌చైర్మన్ అంకంరెడ్డి నారాయణమూర్తి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి సాధించిన యానాం జట్టుకు రూ.50 వేలు, ద్వితీయ స్థానం సాధించిన బొర్రంపాలెం జట్టుకు రూ.30 వేలు, తృతీయ స్థానం సాధించిన బుట్టాయగూడెం జట్టుకు రూ.20 వేలు, నాలుగో స్థానం సాధించిన తెలంగాణ రాష్ట్రం దమ్మపేటకు చెందిన జట్టుకు రూ.10వేలు నగదు, షీల్డ్‌లు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

కుక్కునూరు : యానిమేటర్ల ఆరునెలల వేతనా బకాయిలు విడుదల చేసి, కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం యానిమేటర్ల యూనియన్ సమావేశం కుర్ర గ్రేసీ అధ్యక్షతన ప్రజాసంఘాల కార్యాలయంలో జరిగింది. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ధర్మాజీగూడెంలో గడపగడపకు 100వ రోజు



లింగపాలెం మండలంలో పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

లింగపాలెం : గడపగడపకు మన ప్రభుత్వం 100 రోజుల కార్యక్రమం ధర్మాజీగూడెంలో బుధవారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా తెలిపారు. ఈమేరకు లింగపాలెం మండల వైఎస్సార్ సీపీ నేతలతో సోమవారం ఆయన చర్చించారు. ధర్మాజీగూడెంలో జరిగే భారీ బహిరంగా సభకు ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, పలువురు ముఖ్యనేతలు పాల్గొంటారన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు వైస్ చైర్మన్ దయాల నవీన్‌బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మండలపు సాయిబాబు, మండల వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, ధర్మాజీగూడెం సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పలపాటి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.